
సాక్షి నల్లగొండ

శనివారం, 16, మార్చి, 2024



మురళీకృష్ణుడిగా..
యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీస్వామి మురళీకృష్ణుడిగా అలంకృతుడయ్యారు. - 8లో



'యూనిటీ'కి రెండు అవార్డులు
కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్రపై తీసిన యూనిటీ చిత్రానికి రెండు ఫిలిం ఫెస్టివల్ అవార్డులు లభించాయి. - 10లో



ఇఫ్తార్ 6-32 (శనివారం సా.)
సహర్ 5-01 (ఆదివారం ఉ.)
రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

నల్లగొండ అదనపు కలెక్టర్‌గా పూర్ణచంద్ర

నల్లగొండ: నల్లగొండ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా టి.పూర్ణచంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పూర్ణచంద్ర రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ట్రిబ్యునల్ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

నేడు జెడ్పీస్థాయీ సంఘం సమావేశాలు

నల్లగొండ: నల్లగొండలోని జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.30కు 1వ స్థాయీ సంఘం(ఆర్థిక), 7వ స్థాయీ సంఘం (పనులు), 2వ స్థాయీ సంఘం (గ్రామీణాభివృద్ధి), 4వ స్థాయీ సంఘం (విద్య/వైద్యం) సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు 3వస్థాయీసంఘం (వ్యవసాయం), 2 గంటలకు 5వ స్థాయీ సంఘం (స్త్రీ శిశు సంక్షేమం), 3.30కు 6వ స్థాయీ సంఘం (సాంఘిక సంక్షేమం) సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.

మెడికల్ పోస్టుల మెరిట్ జాబితా విడుదల

నల్లగొండ టౌన్: వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఎన్‌హెచ్‌ఎం పథకం కింద ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు, ఫార్మసిస్టు, ఎంఎల్‌హెచ్‌పీ, మెడికల్ ఆఫీసర్, పీడియాట్రిషన్, సైకాలజిస్టు, ఫ్రిజ్ మెకానిక్, క్వాలిటీ మేనేజర్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పోస్టుల భర్తీ కోసం కాంట్రాక్టు పద్ధతిలో ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించిన ప్రావిజినల్ మెరిట్ జాబితా www.nalgonda.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లో, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉంచామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెషనల్ మెరిట్ జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు లిఖిత పూర్వకంగా తమ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఇది ప్రావిజనల్ మెరిట్ జాబితా మాత్రమేనని, ఎలాంటి అభ్యంతరాలైన లిఖిత పూర్వకంగా రాసి ఇస్తే వాటిని పరిశీలించి రిక్రూట్‌మెంట్ గైడ్‌లైన్స్‌కు లోబడి రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారంగా మెరిట్, సెలక్షన్ జాబితా తయారు చేస్తామని తెలిపారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ ఒకేషనల్ పరీక్షలు

నల్లగొండ: ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఒకేషనల్ పరీక్షలు శనివారంతో పూర్తయ్యాయి. చివరి రోజు జిల్లా వ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో జరిగిన పలు విభాగాల పరీక్షలకు 2,284 మంది విద్యార్థులకు గాను 1,999 మంది హాజరయ్యారు. 285 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ దస్రునాయక్ తెలిపారు.

మహిళల భాగస్వామ్యంతో సమగ్ర అభివృద్ధి

నల్లగొండ రూరల్: మహిళల భాగస్వామ్యంతోనే దేశం సమగ్ర అభివృద్ధి జరుగుతుందని మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి అన్నారు. శుక్రవారం యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. తరతరాలుగా మహిళలు సామాజిక కట్టుబాట్లకు, హింసకు, దోపిడీకి గురవుతున్నారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలతో అభివృద్ధి పథంలో అడుగు పెడుతున్నప్పటికీ ఆశించిన ఫలితాలు కనిపించడం లేదన్నారు. అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుడు అంజిరెడ్డి, సఖి సెంటర్ ప్రతినిధులు సుమలత, దివ్య, నాగమణి, ఎంవీఎస్ రెడ్డి, ప్రేమ్‌సాగర్, రమేష్, కళ్యాణి, ప్రశాంతి, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని కేంద్రీయ విద్యాలయం(కేవీ)లో హ్యాండ్ ఎంబ్రాయిడరీ కోర్సుపై ఇవ్వనున్న ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో చదువు మధ్యలో నిలిపివేసిన వారి కోసం ఈ శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 15 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండి కనీసం పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పదవ తరగతి మార్కుల మెమో, జనన ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్సును జతపరచి మార్చి 18 నుంచి 23వ తేదీ వరకు నల్లగొండ కేంద్రీయ విద్యాలయంలో దరఖాస్తును సమర్పించాలని కోరారు.

అభ్యర్థుల అన్వేషణ!

టార్గెట్.. ఎంపీ

- పార్లమెంట్ ఎన్నికలకు అభ్యర్థులను వెతుకుతున్న ప్రధాన పార్టీలు
- నేడు ఎన్నికల షెడ్యూల్ రానుండడంతో వేగంగా కసరత్తు
- రెండు చోట్ల అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలోకి దిగిన బీజేపీ
- భువనగిరి సీటుకు కాంగ్రెస్‌లో బహుముఖ పోటీ
- రెండు స్థానాల్లోనూ అభ్యర్థులను ప్రకటించని బీఆర్‌ఎస్



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు గుర్రాల ఎంపికే లక్ష్యంగా ప్రధాన పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాల్లో విజయం కోసం సమర్థులైన అభ్యర్థుల కోసం అన్వేషిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు శనివారం షెడ్యూల్ రానున్న నేపథ్యంలో ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికలో తలమునకలయ్యాయి. రాష్ట్రంలో అత్యధిక పార్లమెంట్ స్థానాలు గెలుచుకునే విధంగా కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. బీఆర్‌ఎస్, బీజేపీ నేతలను కలుస్తూ పార్టీలో చేర్చుకునే పనిని వేగవంతం చేసింది. ఉమ్మడి జిల్లాలో ఉన్న రెండు పార్లమెంట్ స్థానాలను దక్కించుకునేందుకు పక్కా వ్యూహంతో వ్యవహరిస్తోంది. కాగా, దేశ వ్యాప్తంగా మోదీ హవా నడుస్తోందని, పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో డబుల్ డిజిట్ స్థానాలను బీజేపీ పొందుతుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాల్లో అభ్యర్థులను నిలిపే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. మరోవైపు బీఆర్‌ఎస్ కూడా అభ్యర్థుల ఎంపిక కసరత్తును వేగవంతం చేసింది. శుక్రవారం రాత్రి అభ్యర్థుల జాబితా ప్రకటించేందుకు సిద్ధమైనా.. ఎమ్మెల్సీ కవిత అరెస్టు నేపథ్యంలో అది వాయిదా పడింది.

భువనగిరిపై కాంగ్రెస్‌లో చర్చోపచర్చలు

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు అభ్యర్థుల ఎంపికలో తలమునకలయ్యాయి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ మొదటి జాబితాలోనే నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థిగా మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పెద్ద కుమారుడు రఘువీర్‌రెడ్డి పేరును ప్రకటించింది. భువనగిరి నుంచి పోటీలో నిలిపే అభ్యర్థిని త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. అక్కడ టికెట్ ఇస్తే అమిత్ పోటీచేస్తారనే ప్రచారం సాగగా, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా టికెట్ అడుగుతున్నారు. అధిష్టానం మాత్రం కోమటిరెడ్డి లక్ష్మిని పోటీలో నిలుపాలంటూ మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిపై ఒత్తిడి తెస్తోంది. ఒకటి రెండు రోజుల్లో భువనగిరి కాంగ్రెస్ టికెట్ ఎవరికి అనేది తేలనుంది.

ప్రచారం మొదలుపెట్టిన బీజేపీ

బీజేపీ మాత్రం భువనగిరి ఎంపీ అభ్యర్థిగా బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన బూర నర్సయ్యగౌడ్‌ను గతంలోనే ప్రకటించింది. అక్కడ ఎన్నికల ప్రచారాన్ని కూడా ప్రారంభించింది. ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది. ఇక్కడ కూడా రేపోమాపో ప్రచారంలోకి దిగేందుకు సిద్ధమైంది. ఇప్పటికే నల్లగొండ బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డి తన అనుచరులతో తాను పార్టీ మారేందుకు గల కారణాలను సమగ్రంగా వివరించి వారిని తన వెంట ఉంచుకునే ప్రయత్నం మొదటి రోజే చేశారు.

రెండు చోట్ల కూడా తేల్చలేదు

బీఆర్‌ఎస్ పార్టీ మాత్రం అభ్యర్థుల అంశం ఇంకా కొలిక్కి రావడం లేదు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్ నల్లగొండ లేదా భువనగిరి నుంచి టికెట్ ఆశించినా, పార్టీలోని పరిస్థితుల కారణంగా తాను పోటీ చేయబోనని అమిత్‌రెడ్డి అధిష్టానానికి స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఆయన కాంగ్రెస్‌లో చేరుతారన్న చర్చ సాగింది. నల్లగొండలో బీఆర్‌ఎస్ నుంచి తేరా చిన్నపరెడ్డి లేదంటే కంచర్ల కృష్ణారెడ్డి పోటీలో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. భువనగిరి నుంచి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని ఎంపీ బరిలో నిలుపుతారని ప్రచారం సాగింది. కానీ, ఆయన అందుకు సిద్ధంగా లేరని, కాంగ్రెస్ పార్టీలో చేరతారన్న ప్రచారం సాగుతోంది. అక్కడ బీజేపీ బీసీ అభ్యర్థిని నిలబెట్టిన నేపథ్యంలో బీఆర్‌ఎస్ కూడా బీసీ అభ్యర్థిని నిలిబెట్టే ఆలోచనలో ఉంది. గతంలో తెరపైకి వచ్చిన పేర్లు కాకుండా కొత్త అభ్యర్థిని నిలబెట్టే ఆలోచనలు చేస్తున్నట్లు తెలిసింది. అన్ని పార్టీలు రెండు, మూడు రోజుల్లోగా అభ్యర్థులను ప్రకటించనున్నాయి.

పౌరసత్వ సవరణ చట్టం వద్దని..



పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలుపుతున్న ముస్లిం మైనార్టీ నాయకులు

ధాన్యం ధరలు తగ్గిస్తే కఠిన చర్యలు

- డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ: రైతులు తెచ్చే ధాన్యానికి ధర తగ్గించి కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో మిల్లర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అదనపు కలెక్టర్ ఆదేశానుసారం మిల్లర్లు ధాన్యం ధరలు తగ్గించి కొనుగోలు చేయొద్దని, ధాన్యం నాణ్యత పేరుతో కోతలు విధించొద్దన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలుకు సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి పి.శ్రీకాంత్, అగ్రికల్చర్ డైరెక్టర్ శ్రవణ్, మిర్యాలగూడ ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, డీటీ జావిద్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ: వస్తు సేవల విషయంలో వినియోగదారులు మోసపోకుండా ముందస్తుగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత వినియోగదారుల సంఘాలు, ప్రభుత్వ సంస్థలపై ఉందని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన ప్రపంచ వినియోగదారుల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు, స్వాతి, రామకృష్ణ, సంధ్యారాణి, శ్రీకాంత్, గురువయ్య, హిమగిరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

ఫసల్ బీమాతో భరోసా

- రైతుల తరఫున ప్రభుత్వమే ప్రీమియం చెల్లింపు
- వానాకాలం నుంచి అమలు
- జిల్లాలో 6 లక్షలకుపైగా రైతులకు ప్రయోజనం



నల్లగొండ అగ్రికల్చర్ : వానాకాలం సీజన్ నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో రాష్ట్ర ప్రభుత్వం చేరనుంది. దీని ద్వారా పంట నష్టం జరినప్పుడు రైతులకు మేలు జరగనుంది. జిల్లాలో 2016 నుంచి 2020 వరకు రాష్ట్రం ఫసల్ బీమా పథకంలో భాగంగా ఉండేది. అప్పుడు చాలా మంది రైతులు ప్రీమియం చెల్లించారు. ఆ తర్వాత అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకం నుంచి తప్పుకుంది. దీంతో రైతులకు పంటలబీమా అందక నష్టపోయారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ పీఎం ఫసల్ బీమాలో చేరాలనే నిర్ణయించడంతో జిల్లాలోనే 6 లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

తక్కువ ప్రీమియం

ఈ పథకంలో రైతులు అతి తక్కువ ప్రీమియం చెల్లిస్తారు. ఆహార ధాన్యాలు లేదా నూనె గింజలకు ప్రతి సీజన్‌కు ఒకే రకమైన ప్రీమియాన్ని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం ప్రీమియంలో రైతులు వానాకాలంలో రెండు శాతం, యాసంగిలో 1.5 శాతం రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. మిగతా మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా బీమా కంపెనీలకు చెల్లిస్తాయి. పంట నష్టం జరిగిందని తెలియగానే బీమా మొత్తంలో 25 శాతం నగదును నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. పొలంలో ఉన్న పంటకు జరిగిన నష్టంతో పాటు పంట కోత తర్వాత జరిగే నష్టాలకు కూడా బీమా వర్తిస్తుంది. వరద ముప్పు వంటి విపత్తులకు కూడా పరిహారం అందుతుంది.

సాంకేతికంగా నష్టం అంచనా

పంట నష్టాన్ని అంచనా వేయడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తారు. స్మార్ట్‌ఫోన్ల ద్వారా ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. విపత్తులో, కోతల తర్వాత జరిగే నష్టానికి పొలం స్థాయిలోనే అంచనా వేస్తారు. బ్యాంకు రుణం తీసుకున్నవారు బీమా తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది.

రైతులకు ఎంతో ప్రయోజనం



ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతులకు ఎంతో మేలు చేస్తుంది. సాగు చేసి పంటలు చేతికొచ్చేదాక ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు కళ్లముందే దెబ్బతింటటే రైతులు ఏమీ చేయలేరు. వానాకాలం నుంచి రైతులు ఫసల్ బీమా యోజన పథకంలో చేరి లబ్ధిపొందాలి.
–పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ

బ్రాహ్మణవెల్లెంలే.. నా బలం బలగం



రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్

- ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని గ్రామంలోనే ప్రారంభిస్తాం
- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- కాంగ్రెస్‌లోకి రమ్మంటే జెడ్పీ చైర్మన్ కూడా వస్తారని ప్రకటన

నార్కట్‌పల్లి: నా బలం.. బలగం..బ్రాహ్మణ వెల్లెంలేనని, రెండున్నరేళ్లలో ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులు పూర్తి చేసి సాగునీరు అందిస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బ్రాహ్మణ వెల్లెంల నుంచి చిట్యాల వరకు రూ.67 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులకు శుక్రవారం గ్రామంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి మొట్టమొదటి శంకుస్థాపన బ్రాహ్మణ వెల్లెంలలోనే చేయిస్తానన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు పేరు వస్తుందనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ బ్రాహ్మణ వెల్లెంల, ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టుల నిర్మాణ పనులను నిధులు మంజూరు చేయలేదని ఆరోపించారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే రాబోయే రోజుల్లో వార్డు సభ్యుడు కూడా కాలేరని చిరుమర్తి లింగయ్యను ఉద్దేశించి అన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలని కోరారు. బీఆర్‌ఎస్ పార్టీలో రోజుకోక నాయకుడు కాంగ్రెస్, బీజేపీలోకి వెళ్తుతున్నారని, చివరికి బీఆర్‌ఎస్ పార్టీలో మిగిలేది ఆ నలుగురు మాత్రమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి రమ్మంటే నల్లగొండ జిల్లా జెడ్పీ చైర్మన్ కూడా వస్తారని ప్రకటన చేశారు. ఎన్నికల తరువాత ప్రతీక్‌రెడ్డి పేరుతో లైబ్రరీ నిర్మిస్తానని పేర్కొన్నారు. బ్రాహ్మణ వెల్లెంలను సోలార్ విలేజ్‌గా మార్చి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ అభివృద్ధే లక్ష్యంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో పనిచేస్తానన్నారు. రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేయడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టుతోపాటు ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వల పనులకు అధిక నిధులు మంజూరు చేయాలన్నారు. నార్కట్‌పల్లి డిపోను పునర్నిర్మించాలన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు ఉన్న రోడ్లకు నిధులను కేటాయించాలని కోరారు. అనంతరం మంత్రి స్థానిక ప్రజలతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, నల్లగొండ ఆర్డీఓ రవి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, భరత్, భూపాల్‌రెడ్డి, అచ్చాలు, సత్తయ్య, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణ వెల్లెంలలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

రామగిరి(నల్లగొండ): జాతీయ లోక్ అదాలత్‌తో కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో 14 లోక్ అదాలత్ బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్ తగాదాలు, రాజీ పడదగిన క్రిమినల్, మోటారు వాహన ప్రమాద, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్, భూ వివాదాలు, కుటుంబ కలహాలు, డ్రంక్ డ్రైవ్, ప్రీ లిటిగేషన్, బ్యాంకు, బీఎస్‌ఎన్‌ఎల్, వినియోగదారుల ఫోరమ్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. మొత్తం 13,497 కేసులు ఉండగా అందులో 3,330 కేసులు పరిష్కరించబడ్డాయన్నారు. ఇంకా 10,167 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసులకు అప్పీలు ఉండదన్నారు. కోర్టు ఫీజు కూడా వాపస్ ఇవ్వబడుతుదన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ జడ్జి బి.దీప్తి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు

అమ్మాయిలు తగ్గుతున్నారు

జిల్లాలో వెయ్యిమంది బాలురకు 896 మందే బాలికలు

- ఏటేటా పడిపోతున్న ఆడపిల్లల సంఖ్య
- మూఢ నమ్మకాలు, అబార్షన్‌లే కారణం
- మగపిల్లలకే ప్రాధాన్యమిస్తున్న కొందరు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం నివేదికలో వెల్లడి

సంవత్సరం	బాలురు	బాలికలు
2017-18	9,175	6,832
2018-19	10,314	9,330
2019-20	10,814	10,001
2020-21	11,326	10,450
2021-22	12,322	11,112
2022-23	12,178	10,721
2023-24	10,299	9,199



నల్లగొండ టౌన్: జిల్లాలో ఏటేటా బాలికల సంఖ్య తగ్గుతుండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మూఢ నమ్మకాలకు తోడు కట్నకానుకలు ఇవ్వాల్సి రావడం, వారసులే కావాలనే భావనతో కొందరు దంపతులు ఆడపిల్లలను కనడానికి ఇష్టపడడం లేదు. ఆరేళ్లుగా జిల్లాలో మగపిల్లల కంటే ఆడపిల్లల జననాలే తగ్గుతూ వస్తున్నాయి. ఫలితంగా ఆడపిల్లల లింగ నిష్పత్తి క్రమంగా పడిపోతోంది. రాష్ట్ర ప్రణాళికా సంఘం నివేదిక ప్రకారం బాలబాలికల నిష్పత్తిలో చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. దీని ప్రకారం ప్రస్తుతం జిల్లాలో 1000మంది బాలురకు 896 మంది బాలికలే ఉన్నారు. దీంతో జిల్లాలో మగవారి పెళ్లిళ్లు చేయడానికి ఆడపిల్లలు దొరడంలేదు. దీని కారణంగా ముప్పై ఏళ్లు నిండినా పెళ్లిళ్లు కాని మగవారి సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ప్రస్తుతం ఆడపిల్లలకు కట్నకానుకలు ఇవ్వకున్నా ఎదురు కట్నం ఇచ్చి మరీ పెళ్లి చేసుకునే పరిస్థితి నెలకొంది.

ఆడపిల్ల అని తేలితే అబార్షన్లు

పదేళ్లుగా జిల్లాలో అబార్షన్లను చేయించుకుంటున్న వారి సంఖ్య పెరిగిపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో విచ్చలవిడిగా స్కానింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్‌లను చేస్తూ లక్షలాది రూపాయలను దండుకుంటున్న దుస్థితి జిల్లాలో నెలకొంది. మూఢ నమ్మకాల కారణంతో పాటు మగపిల్లలు కావాలనే భావనతో ముందుగానే స్కానింగ్ చేయించుకుంటున్నారు. ఆడపిల్ల అని స్కానింగ్‌లో తేలగానే అబార్షన్లు చేయించుకుంటున్నారు. దీంతో జిల్లాలో ఆడపిల్లల జననాలు తగ్గుతున్నాయి.

చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తేనే..

లింగ నిర్ధారణ పరీక్షలను చేసి ఆడామగ అని సమాచారాన్ని అందజేసే కేంద్రాలపై, అబార్షన్లను ప్రోత్సహించే వారితో పాటు చేసే వైద్యులపై పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. స్కానింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడు ఆడపిల్లల జననాలు పెరిగే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. అదేవిధంగా పీసీపీఎన్‌డీటీ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం కూడా వైద్య ఆరోగ్యశాఖపై ఉంది.

స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాం



జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. అన్ని కేంద్రాలను విధిగా తనిఖీలను నిర్వహిస్తున్నాం. లింగ నిర్ధారణ పరీక్షలను చేసే కేంద్రాలతోపాటు అబార్షన్లను చేసే వైద్యులపై ఉక్కుపాదం మోపుతాం. వాటిని చేసే కేంద్రాలు, ప్రోత్సహించే వారిపై కేసులను నమోదు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తాం.
– డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ

ఈ-పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలి

- జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

గుర్రంపోడు: ఫర్టిలైజర్ దుకాణదారులు తప్పనిసరిగా ఈ-పాస్ ద్వారానే రైతులకు ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఈఓ) పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల వాస్తవ నిల్వలు, ఈ పాస్ మిషన్ నిల్వలకు తేడా లేకుండా ఉండాలన్నారు. అంతకుముందు మండలంలోని తేనపల్లి గ్రామంలో వరి పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. వరిలో సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. వరిపొలం పొలగింజ దశలో ఉన్నప్పుడే కాండం తొలుచు పురుగులను గమనించి వాటి నివారణకు కార్టిప్ హైపోక్లోరైడ్ 50 ఎస్పీ ఒక గ్రామును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. లేదా క్లోరోట్రినోప్రోలు 0.4 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి కంచర్ల మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.



దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఏఓ

క్లుప్తంగా

సాండ్‌బాక్స్ కాలిపై పడి పారాయణికుడికి గాయాలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఓ పారాయణికుడి కాలిపై సాండ్‌బాక్స్ పడి శుక్రవారం గాయాలయ్యాయి. శ్రీస్వామి వారి శ్రీకృష్ణ అలంకార సేవను ఆచార్యులు మాడ వీధిలో ఊరేగిస్తూ తూర్పు మాడ వీధిలో వేంచేపు చేశారు. అక్కడే పారాయణికులు కూర్చునే చోట సౌండ్ బాక్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సౌండ్ బాక్స్‌కు సంబంధించిన వైర్లు, ఇతర వైర్లు పారాయణికుడి కాలికి తగలడంతో ఒకదానిపై ఒకటిగా అమర్చిన సౌండ్‌బాక్స్‌లు ఒక్కసారిగా పారాయణీకుడి కాలుపై పడి గాయాలయ్యాయి. వెంటనే అతడిని దేవస్థానం వైద్యాధికారులు పరీక్షించి, అక్కడి నుంచి కొండ కిందకి ప్రత్యేక వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


ప్రవళిక (ఫైల్)

చిలుకూరు : విద్యుదాఘాతానికి గురై ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని నారాయణపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండా సతీష్ భార్య ప్రవళిక (26) బట్టలు ఉతికి ఇంట్లోని ఇనుప దండానికి ఆరవేస్తుండగా దండానికి విద్యుత్ సరఫరా జరిగి విద్యుత్ షాక్‌కు గురైంది. ఇది గమనించిన ఆమె భర్త, కుటుంబ సభ్యులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం ఆమెను కోదాడ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి తండ్రి నందిగామ గోవింద్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాంబాబు తెలిపారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

వలిగొండ : ఉరివేసుకొని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మోటం అనిల్ (23)కు 4సంవత్సరాల క్రితం జమ్మికుంటకు చెందిన భాగ్యమ్మతో వివాహం జరిగింది. కాని వారికి పిల్లలు పుట్టకపోవడంతో 4నెలల క్రితం విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి అనిల్ పనులకు వెళ్లకుండా కాలీగా ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో అతడు తన తల్లి గౌరమ్మ ఇంట్లో దాచిన రూ.8వేలు తీసుకొని గురువారం రాత్రి వరకు తాగాడు. తల్లి డబ్బులు ఏమయ్యాయని మందలించడంతో ఆమెను కొట్టి వెళ్లి స్థానిక మార్కెట్ ఆవరణలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చెట్టుకు వేలాడుతూ కనిపించిన అతడిని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, తల్లి గౌరమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శ్యామ్‌సుందర్ రెడ్డి శుక్రవారం తెలిపారు.

మురళీకృష్ణుడిగా పొన్న వాహనంపై..

- భక్తులకు దర్శనమిచ్చిన శ్రీలక్ష్మీనృసింహుడు
- ఐదో రోజు ఆధ్యాత్మికంగా సాగిన బ్రహ్మోత్సవాలు
- నేడు ఉదయం గోవర్ధనగిరిధారి అలంకారసేవ.. రాత్రి సింహ వాహనసేవ


ఆలయ తిరువీధిలో అలంకార సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం ఉదయం శ్రీస్వామి వారు శ్రీమురళీకృష్ణుడి అలంకార సేవలో.. రాత్రి పొన్న వృక్షారూఢుడై ఆలయ తిరు, మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చాడు. శ్రీస్వామి వారి ఆలయంలో ఉదయం నిత్య ఆరాధనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వేణువును చేతబట్టి, ప్రతిఒక్కరిని రక్షించే మురళీకృష్ణుడి (శ్రీకృష్ణ)గా అలంకార సేవను నిర్వహించారు. శ్రీస్వామిని నిత్యకల్యాణ మండపంలో మురళీకృష్ణుడిగా తీర్చిదిద్దిన ఆచార్యులు ప్రత్యేక పల్లకి సేవపై అధిష్టింపజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటచార్యులు స్వామివారి సేవకు హారతినిచ్చి తిరు, మాడ వీధుల్లో సేవోత్సవానికి తీసుకెళ్లారు. అనంతరం భాజా భజంత్రీలు, సన్నాయి మేళాలతో మురళీకృష్ణుడికి రాగాలాపన చేశారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈఓ రామకృష్ణరావు, ఆలయ ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహ చార్యులు, కాండూరి వెంకటచార్యులు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, అధికారులు గజివెల్లి రఘు, దొమ్మాట సురేందర్‌రెడ్డి, పారాయణీకులు, వేద పండితులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

పొన్న వాహనంపై ఊరేగింపు..

శ్రీస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో సాయంత్రం నిత్య ఆరాధనలు వైభవంగా జరిగాయి. అనంతరం శ్రీస్వామిని పొన్న వాహన సేవలో ఊరేగింపు చేపట్టారు. ఆచార్యులు, యజ్ఞాచార్యులు, అర్చక బృందం సభ్యులు వేద పారాయణాలు పఠిస్తుండగా శ్రీస్వామి వారి పొన్న వాహన సేవ ఆలయం మాడ వీధుల్లో భక్తుల మధ్య బయల్దేరింది. పొన్నవాహన సేవలో భక్తులు పాల్గొని కనులారా తిలకించారు.

నేడు గోవర్ధనగిరిధారిగా స్వామివారు..

శ్రీస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం గోవర్ధనగిరిధారి అలంకార సేవ, రాత్రి సింహ వాహన సేవను నిర్వహించనున్నారు.


తూర్పు మాఢ వీధిలో పొన్న వాహన సేవను అధిష్టించి పారాయణం పఠిస్తున్న అర్చకులు


శ్రీకృష్ణుడి అలంకార సేవకు హారతినిస్తున్న అర్చకులు

కల్యాణోత్సవ ఏర్పాట్ల పరిశీలన

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 18న నిర్వహించే తిరు కల్యాణోత్సవం ఏర్పాట్లను శుక్రవారం యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్, సీఐ రమేష్ పరిశీలించారు. కల్యాణ వేదికతో పాటు వీవీఐపీ, వీఐపీ, భక్తులకు సంబంధించిన గ్యాలరీల ఏర్పాట్ల అంశాలను పరిశీలించి, ఆలయాధికారులతో మాట్లాడారు. బందోబస్తు ఏర్పాటు అంశాలపై ఆలయాధికారులతో చర్చించారు.

సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం


సంగీత కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ అధికారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను శుక్రవారం ఏర్పాటు చేశారు. భక్తులను మరింత ఆధ్యాత్మిక చింతనలోకి తీసుకెళ్లే విధంగా ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఉదయం 5.30గంటలకు శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాతభేరీ కార్యక్రమం, ఆస్థానం వారిచే మంగళ వాయిద్యం, వైదిక ప్రార్థనలు జరిపించారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన శ్రీసాయిబాబా సేవా సమితి, భూదాన్‌పోచంపల్లికి చెందిన శ్రీలక్ష్మీనారాయణ భజన మండలి, యాదగిరిగుట్టకు చెందిన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి మహిళా భజన మండలిచే భజన కార్యక్రమం జరిపించారు. తదుపరి మసన చెన్నప్పచే ఉపనిషత్ వైభవం, ఉపన్యాసం నిర్వహించారు. అల్లం కనకదుర్గ భాగవతారిణిచే భక్త ప్రహ్లాద హరికథాగానం గావించారు. కొండూరి పద్మావతి బృందంచే శ్రీనరసింహ సహస్ర నామ స్తోత్ర పారాయణం జరిపించారు. సాయంత్రం రాధిక మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, జి.ఇందిరా, విష్ణుప్రియచే భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించారు. తాడూరి రేణుక, సౌందర్య కౌశిక్, స్వతంత్ర్య కృష్ణ, అన్నదానం సహస్ర బృందం, కుమారి ప్రణుతి ఆదర్శినిచే కూచిపూడి నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. జనగాంకు చెందిన చంద్రకళా నిలయంచే పేరిణి నృత్య ప్రదర్శనను భక్తులు తిలకించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యంతో నిందితులు, పోలీసులు

గరిడేపల్లి : అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న ఓ వాహనాన్ని మండల పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లవారుజామున గరిడేపల్లి నుంచి అశోక్ లేలాండ్ వాహనంలో అక్రమంగా పీడీఎస్ బియ్యం రవాణా చేస్తున్నారనే నమ్మదగిన సమాచారంతో మండల పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఓ వాహనాన్ని స్వాధీనం చేసుకుని విచారించారు. పల్నాడు జిల్లా మాచర్ల మండలం కుంభంపాడు గ్రామానికి చెందిన కొండ గోపితో పాటు మరికొంత మంది కలిసి అక్రమంగా రేషన్ బియ్యం కొని రవాణా చేస్తున్నారని తెలిపారు. వాహనంలో 30క్వింటాల రేషన్ బియ్యం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైద్యం వికటించి వ్యక్తి మృతి

తుంగతుర్తి : వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వెంపటి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంటి యాదయ్య (58) అనారోగ్యంతో స్థానిక ఆర్‌ఎంపీ (మెడికల్‌షాపు నడుపుతున్న) పుల్లూరు వెంకన్న దగ్గరకు వైద్యం కోసం వెళ్లాడు. అతడు చేసిన వైద్యం వికటించి యాదయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోధిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


కొక్కుల్ల కిషోర్

హుజూర్‌నగర్ : టిఫిన్ సెంటర్ ఏర్పాటుకు కావాల్సిన వస్తువులు తెచ్చేందుకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన హుజూర్‌నగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ నుంచి బతుకుదెరువు కోసం హుజూర్‌నగర్‌కు వచ్చిన కొక్కుల్ల కిషోర్ స్థానిక టిఫిన్ సెంటర్‌లో మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. కిషోర్ ఇటీవల స్వంతంగా టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకోవాలని ఆలోచనతో హైదరాబాద్‌లో కుర్చీలు, బల్లాలు, ఇతర సామగ్రి తెచ్చేందుకు ఈనెల 9న భార్యకు చెప్పివెళ్లాడు. కాని ఇప్పటికీ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అతడి భార్య అనూష శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మాదాపురంలో యువతి..


అదృశ్యమైన భబిత

తుర్కపల్లి : ఓ యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని మాదాపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జూపల్లి భబిత(19) భువనగిరిలోని నవభారతి డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతుంది. భబిత గురువారం మధ్యాహ్నం బయటకు వెళ్లివస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో యువతి తల్లిదండ్రులు బంధువులు, తెలిసినవారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లేకపోవడంతో తండ్రి బాలయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ తక్యుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

యువకుడి మృతికి కారణమైన ఇద్దరి అరెస్టు

మేళ్లచెరువు : మండల కేంద్రంలో ఈనెల 12న జరిగిన ప్రమాదంలో యువకుడి మృతికి కారణమైన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ.పరమేష్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాహనాన్ని నడిపిన షేక్ మథార్, యాజమాని సతీష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఎంసీపీఐ (యూ) నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా మట్టయ్య


మట్టయ్యను ప్రకటిస్తున్న నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా ఎంసీపీఐ యూ పార్టీ అభ్యర్థిని ప్రకటించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో జరిగిన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో తనను బీఎల్‌ఎఫ్ బలపర్చిన అనంతరం పార్టీ జాతీయ కార్యదర్శి అశోక్ ఓంకార్ ఎంపిక చేసినట్లు మట్టయ్య వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన జాతీయ కార్యదర్శి అశోక్ ఓంకార్, బీఎల్‌ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్ల సూర్యప్రకాశ్, ఎంసీపీఐ యూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధులు భీంరెడ్డి నరసింహారెడ్డి, మద్దికాయల ఓంకార్ వారసుడిగా తనను ఎంపీగా గెలిపించాలని మట్టయ్య కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రామన్నపేట : మండల కేంద్రం శివారులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను రామన్నపేట పోలీసులు అరెస్టు చేశారు. వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని చిట్యాల రోడ్డులో గల ఓ రైస్‌మిల్లు వెనుకభాగంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు స్థానిక పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1700ల నగదు స్వాధీనం చేసుకున్నారు.

కేసు నమోదు


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సతీష్

చందంపేట : గుప్తనిధుల కలకలంలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సతీష్ శుక్రవారం తెలిపారు. మండలంలోని బుడ్డోనితండా గ్రామపంచాయతీ పరిధిలోని వెంకట్‌నాయక్‌తండా సమీపంలో బుధవారం రాత్రి గుప్తనిధుల తవ్వకాలు జరిగినట్లు గ్రామస్తుల సమాచారం మేరకు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బస్వాపురంలో చైన్ స్నాచింగ్

భువనగిరి క్రైం : ఓ మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని దుండగులు పుస్తెలతాడును అపహరించారు. ఈ సంఘటన మండలంలోని బస్వాపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. బస్వాపురం గ్రామానికి చెందిన పులి చంద్రకళ రైతుబజారులో పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. ఈ ఆమె రైతు బజారులోని పనిముగించుకొని భర్త రామచంద్రయ్యతో కలిసి టీవీఎస్ ద్విచక్రవాహనంపై గ్రామానికి వస్తుండగా బస్వాపురం ప్రాణిహిత ప్రాజెక్టు వద్ద వెనుక నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు చంద్రకళ మెడలో నుంచి పుస్తెలతాడును అపహరించుకుపోయారు. ఈ మేరకు బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నకిలీ ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్లు

- ఇస్కిళ్ల గ్రామ పంచాయతీలో వెలుగు చూసిన ఘటన


ఇస్కిళ్ల గ్రామపంచాయతీ కార్యాలయం

రామన్నపేట: కొందరు వ్యక్తులు బదిలీపై వెళ్లిన ఉద్యోగుల సంతకాలు, స్టాంపులతో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్లకు తెరలేపారు. ఇటీవల రామన్నపేట మండలం ఇస్కిళ్ల ఈ పంచాయతీ లాగిన్ పరిశీలనలో నకిలీ ధ్రువపత్రాలు, అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారం వెలుగుచూసింది. ఇస్కిళ్ల గ్రామపంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహించిన ఓ మహిళా ఉద్యోగి 2019 ఏప్రిల్ 11న బదిలీపై వెళ్లారు. నాలుగు సంవత్సరాల తరువాత కొందరు వ్యక్తులు ఆమె సంతకం, స్టాంప్‌తో గత సంవత్సరం సెప్టెంబర్ 14, అక్టోబర్ 5, గత నెల 22వ తేదీల్లో నకిలీ ధ్రువపత్రాలు పత్రాలు సృష్టించారు. వీటితో ఇళ్లు, స్థలాలను రామన్నపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. అయితే ధ్రువపత్రం ఒరిజినలా లేదా నకిలీదా అని పరిశీలించకుండానే పంచాయతీ లాగిన్‌లో వారి పేరిట ఇళ్లు, స్థలం ఉండడంతో అధికారులు రిజిస్ట్రేషన్ చేశారు. అలా రిజిస్ట్రేషన్ చేయించిన వాటిలో గ్రామపంచాయతీకి సంబంధించిన 200గజాల స్థలం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి వారం రోజుల క్రితం గ్రామానికి సంబంధించిన ఈ పంచాయతీ లాగిన్‌ను పరిశీలిస్తుండగా నకిలీ ధ్రువపత్రాలు, అక్రమ రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన వ్యవహారం వెలుగుచూసింది.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు..

పంచాయతీ కార్యదర్శి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చలాన్ చెల్లించి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లకు సంబంధించిన నకలును తీసుకొని పరిశీలించగా విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. ఈమేరకు నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించిన వారిపై పంచాయతీ కార్యదర్శి రామన్నపేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయంపై రిజిస్ట్రార్ నగేష్‌ను సంప్రదించగా ఈ పంచాయతీ లాగిన్‌లో ధ్రువపత్రం తెచ్చిన వారి పేరిట ప్రాపర్టీ ఉండడంతో రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని తెలిపారు. ఇదిలా ఉండగా.. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల ఈ పంచాయతీ లాగిన్‌లను క్షుణ్ణంగా పరిశీలిస్తే ఇలాంటి అక్రమ రిజిస్ట్రేషన్‌లు, నకిలీ ధ్రువపత్రాలు ఇంకా అనేకం వెలుగుచూసే అవకాశం ఉంది.

పాత కక్షల నేపథ్యంలోనే కత్తులతో దాడి

- ఏడుగురి అరెస్టు.. గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ శివరాంరెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండక్రైం : పాతకక్షలతో ఇరువర్గాల యువకులు కత్తులతో దాడి చేసుకున్న ఘటన ఈనెల 10న పట్టణంలోని రాక్‌హిల్స్‌కాలనీలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఏడుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి అరకిలో గంజాయి, ఏడు సెల్‌ఫోన్లు, ఓ కత్తిని టూటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి వెల్లడించారు. పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన మేడబోయిన చక్రి, అదే కాలనీకి చెందిన అఖిల్ స్నేహితులు. చక్రి ఇటీవల గంజాయి కేసులో జైలుకు వెళ్లివచ్చాడు. తాను జైలుకు వెళ్లడానికి తన స్నేహితుడైన అఖిలే కారణమనే అనుమానంతో అఖిల్‌పై చక్రి కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఎలాగైన అఖిల్‌ను హత్య చేయాలని చక్రి ప్లాన్ వేశాడు. దీంతో చక్రి తన స్నేహితులైన పట్టణానికి చెందిన మహ్మద్ సమీర్, దోటి ఉపేందర్, కందిగట్ల అభిరామ్, గజ్జి హర్షవర్ధన్, ఒట్టికోటి శేఖర్, కొమ్మనపల్లి మహేష్‌ను రాక్‌హిల్స్‌కాలనీ వైపు పిలిపించి అఖిల్‌ను హత్య చేయాలని ప్లాన్ వేశారు. అదే సమయంలో అఖిల్ మద్యం మత్తులో కత్తితో తన స్నేహితుడైన సూరారపు రాజు, గాదెపాక నవనీత్, ఎండీ.షోయబ్‌లతో వచ్చి చక్రి, ఉపేందర్‌పై దాడికి దిగాడు. ఈ దాడిలో వారి చేతి వేళ్లకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఇదే సమయంలో అఖిల్ స్నేహితుడైన సూరారపు రాజుపై చక్రితో పాటు అతడి స్నేహితులు కత్తితో దాడి చేయడంతో వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. ఇరువర్గాలు వారు గంజాయి, మద్యం మత్తులో కత్తులతో దాడులు చేస్తుకున్నారు. ఈ ఘటనపై సూరారపు రాజు, అతడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు చక్రి స్నేహితులైన ఏడుగురిపై ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. అఖిల్‌తో పాటు అతడి స్నేహితులు ప్రకాష్, నవనీత్, షోయబ్‌లు పరారీలో ఉన్నారని అన్నారు. కేసును సమగ్రంగా విచారించిన సీఐ డానియెల్, ఎస్‌ఐ నాగరాజు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

మర్రిగూడ : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని తిరగండ్లపల్లి గ్రామసమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం మండలం తాడిపర్తి గ్రామానికి చెందిన పాలగోని మంజుల (40) తన భర్త నరేందర్‌తో కలిసి వట్టిపల్లి గ్రామానికి వెళ్లి స్వగ్రామానికి వస్తుండగా తిరగండ్లపల్లి గ్రామ సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న వాహనానికి గేదె అడ్డురావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో మంజుల తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందగా భర్త నరేందర్ గాయపడి పరిస్థితి విషమంగా ఉండంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. స్థానికులు సమాచారం మేరకు ఘటనా స్థలానికి స్థానిక ఎస్‌ఐ కె.రంగారెడ్డి చేరుకోని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

యూటర్న్ తీసుకుంటూ..


తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరెడ్డి

మునగాల : రోడ్డు ప్రమాదంలో ఓ రైతు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండలంలోని ముకుందాపురం శివారులోని జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలి పిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి(48) తన పొలానికి పురుగుమందులను కొనేందుకు మండలంలోని ముకుందాపురంలో గల ఓ ఫెస్టిసైడ్ దుకాణానికి వచ్చాడు. అనంతరం మందులు కొనుగోలు చేసి తన ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో ముకుందాపురం శివారులో జాతీయరహదారిపై యూటర్న్ తీసుకుంటుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు అతడి వాహనాన్ని వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరెడ్డి తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108లో కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా తీవ్ర రక్తస్రావంతో మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య సీతమ్మ ఫిర్యాదుతో ఎస్‌ఐ బైరెడ్డి అంజిరెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని రిటైర్డ్ హెచ్‌ఎం దుర్మరణం


జనార్దన్ (ఫైల్)

తుంగతుర్తి : ప్రమాదవశాత్తు టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని కారు ఢీకొనడంతో రిటైర్డ్ హెచ్‌ఎం మృతి చెందగా అతడి భార్య తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని బండరామారం స్టేజి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మండలంలోని పసునూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం గుమ్మడవెల్లి జనార్దన్(78) భార్య చంద్రకళతో కలిసి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై తుంగతుర్తికి వచ్చి స్వగ్రామం వెళ్తుండగా మండలంలోని బండరామారం స్టేజి వద్దకు రాగానే నాగారం నుంచి తుంగతుర్తికి వస్తున్న ఓ కారు అతివేగంగా వచ్చి జనార్దన్ ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో జనార్దన్, అతడి భార్య చంద్రకళకు తీవ్రగాయాలయ్యాయి. వారిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా జనార్దన్ మృతి చెందాడు. చంద్రకళ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు హరిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపారు.

మంత్రి వెంకట్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

- 2015లో ఎంపీడీవో కార్యాలయం ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ రగడ
- 2021లో కోమటిరెడ్డికి రూ.4,200 జరిమానా విధించిన కోర్టు
- దీనిపై హైకోర్టుకు వెళ్లిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ప్రొటోకాల్ ఉల్లంఘన కేసులో రూ.4,200 జరిమానా విధిస్తూ 2021లో ఎమ్మెల్యేలు, ఎంపీల కోర్టు ఇచ్చిన తీర్పును ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. నల్లగొండ ఆర్డీవో కార్యాలయాన్ని నాటి మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించడం కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే, ప్రొటోకాల్‌ను ఉల్లంఘించి ఎమ్మెల్యే కోమటిరెడ్డి కార్యాలయాన్ని ప్రారంభించారు. దీంతో ఆర్డీవో ఫిర్యాదు మేరకు 2015లో నల్లగొండ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ట్రయల్ కోర్టు కోమటిరెడ్డికి జరిమానా విధించింది. దీన్ని ఆయన హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ కె.లక్ష్మణ్.. ఎమ్మెల్యే, ఎంపీ కోర్టు విధించిన జరిమానాను రద్దుచేశారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులోనూ..

అలాగే 2014 కనగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును కూడా హైకోర్టు కొట్టివేసింది. 2014లో ఎంపీడీవో కార్యాలయంలో జనరల్ బాడీ మీటింగ్‌లో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన తనను అసభ్య పదజాలంతో వెంకట్‌రెడ్డి దూషించారని నాటి కనగల్ ఎంపీపీ కృష్ణయ్య ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్.. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చారు.

మట్టపల్లిలో నృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని శుక్రవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా ముస్తాబుచేసి ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రసవత్తరంగా రక్తిగట్టించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణి భూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.